

మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

7

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలు

ఒకటిరెండ్రోజుల్లో పూర్తి చేయాలి : వజ్రేష్‌యాదవ్

గ్రూప్-1 మెయిన్స్ పకడ్బందీగా

నిర్వహించాలి

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మేడ్చల్ అక్టోబరు 15(ఆంధ్ర జ్యోతి ప్రతినిధి) : అధికారులు సమన్వయంతో గ్రూప్-1 మెయిన్స్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్‌ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఒక రోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను పరిశీలించాలన్నారు. డీఆర్‌ఓ హరిప్రియ, సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



నేవీ రాడార్ శంకుస్థాపన సందర్భంగా వేదికపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఎంపీలు, స్పీకర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నేవీ అధికారులు

కలిసి పనిచేస్తాం

దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం

- సిద్ధాంతాలు వేరైనా అన్ని పార్టీలతో కలిసి వెళ్తాం
- పర్యావరణానికి హాని అనేది పూర్తి అవాస్తవం
- గిట్టనివారు చేసే ఆరోపణలను పట్టించుకోవద్దు
- ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు స్థానిక ప్రజలకు గర్వకారణం
- ప్రపంచపటంలో వికారాబాద్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు
- నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- హాజరైన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్/పరిగి/పూడూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయమని అందరం కలిసి పని చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికలప్పుడే పార్టీలు రాజకీయాలు చేయాలని, దేశ రక్షణ విషయంలో అందరు కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండంలో మంగళవారం వీఎల్‌ఎఫ్(వెరీ లో ఫ్రీక్వెన్సీ) నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఇక్కడ ఏర్పాటు చేయడం జిల్లా

మిగతా 7వ పేజీలో...

సరసస్వర సుర..

తెలుగు సంగీతానికి చిన్నారుల స్వరసేవ

- యూట్యూబ్ చానల్‌తో ప్రత్యేక గుర్తింపు
- రెండేళ్లలో 1.74 లక్షల సబ్‌స్క్రైబర్లు
- ప్రజల మన్ననలు పొందుతున్న నిఖిత, రుచిత



సంగీతంపై రీల్స్ చేస్తున్న చిన్నారులు నిఖిత, రుచిత

ప్రస్తుతం సమాజాన్ని ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారింది. ప్రజా సంబంధాలు, సమాజంపై అవగాహన ఉన్న ఏ వ్యక్తి నోటా విన్నా ఓ యూట్యూబ్ చానల్ ప్రయత్నం చేయరాదా? అని చెబుతుంటారు. ఆ దిశగా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా రీల్స్ చేసి అప్‌లోడ్ చేయడం సాధారణమైంది. యూట్యూబ్ చానల్ క్రియేట్ చేసి వారు అప్‌లోడ్ చేసి రీల్స్‌తో సమాజాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటున్నారు. లక్షల సబ్‌స్క్రైబర్స్, కోట్లల్లో వ్యూవర్స్‌తో దూసుకపోతున్నారు. వారి వివరాలతో ప్రత్యేక కథనం.

7



సుల్తాన్‌పూర్‌లో

భారీ చోరీ

- ఐదు ఇళ్లలో దొంగతనాలు
- తాళం వేసి ఉన్నవే టార్గెట్
- 12తులాల బంగారు ఆభరణాలు 46తులాల వెండి, రూ.50వేల నగదు అపహరణ
- పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు

8

ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన

- దామగుండం వెళ్లకుండా బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టులు
- పోలీస్ స్టేషన్లకు తరలింపు
- నల్లబ్యాడ్జీలతో జేఏసీ, ప్రజాసంఘాల నాయకుల నిరసనలు

8



కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ నాయకులు

వైభవంగా రేణుకాఎల్లమ్మ

కల్యాణం

- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
- వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు
- ప్రసాద వితరణ.. అన్నదానాలు


7



అయోమయం!

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై మల్లగుల్లాలు

- రెండు రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు
- అధికారులకు తలనొప్పిగా మారిన కమిటీల ఏర్పాటు
- పథకం అమలులో కమిటీలదే ముఖ్యపాత్ర



మేడ్చల్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా దరిచేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈనెల 11న దసరా పండుగ రోజున కమిటీల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ఉత్తర్వులో 12లోగా కమిటీల నియామకానికి పేర్లను పంపించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 11న దసరాసెలవు, 12న ఆదివారం కావడంతో ఉత్తర్వులను అందుకున్న అధికారులు ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకున్నారు. పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో పాలకవర్గం లేకపోవడంతో కార్యదర్శి కమిటీకి అధ్యక్ష వహించనున్నాడు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు కమిటీలను నియమించనున్నారు. ప్రభుత్వం హడావుడిగా జారీ చేసిన ఉత్తర్వులతో కమిటీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గ్రామస్థాయిలో కమిటీకి సర్పంచ్ లేదా పంచాయతీ ప్రత్యేకఅధికారి ఛైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉండనున్నారు. మున్సిపల్ వార్డు స్థాయిలో కౌన్సిలర్ లేదా కార్పోరేటర్ ఛైర్మన్‌గా వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఈ రెండు కమిటీల్లో స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, గ్రామ, మున్సిపల్ వార్డు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా

మిగతా 8వ పేజీలో...



బల్దియా భవనం..

ఫైల్ మాయం!

పాత బిల్డింగ్ వివరాలు లేవంట

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీకి సంబంధించి గతంలో ఖాళీ స్థలాలు, భవనాలు, ఆస్తుల గురించి అప్పటి కమిషనర్లు వివరాలు రాతపూర్వకంగా వెల్లడించారు. ప్రస్తుతం బల్దియా అధికారులు పాతభవనానికి సంబంధించిన వివరాలు లేవని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారుడికి తెలియజేశారు. పట్టణంలో నడిబొడ్డున కోట్ల రూపాయల విలువ చేసే ఈ భవనంలో కొన్నేళ్లుగా మున్సిపాలిటీ కార్యాలయం కొనసాగింది. ప్రస్తుతం స్థలం, భవనం, అన్యాక్రాంతం అవుతున్న విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ భవనానికి దిక్కు లేదు. మున్సిపాలిటీ ఖాళీస్థలాలపై కబ్జాల గురించి చెప్పనవసరం లేదు. పాత మున్సిపల్ భవనం స్థలం, భవనాల వివరాల ఫైల్ మాయంపై బల్దియా అధికారులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వివాదాల రాణా!

అవినీతి ఆరోపణలకు కేరాఫ్‌గా కరణ్‌కోట్ పీఎస్

- 2012నుంచి ప్రతీ ఏడాది ఏదో ఒక వివాదం
- ఐజీ కార్యాలయానికి పలువురు సీఐల అటాచ్
- 2013లో స్టేషన్ భవనం నుంచి దూకి కస్టడీలో ఉన్న వ్యక్తి ఆత్మహత్య
- 2018లో సీఐ సస్పెన్షన్



తాండూరు, అక్టోబరు 15: కరణ్‌కోట్(తాండూరురూరల్) పోలీస్‌స్టేషన్ వివాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ సీఐలు పూర్తికాలం పని చేయకుండానే ఐజీ కార్యాలయానికి అటాచ్ అవుతున్నారు. తాండూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే యాలాల ఎస్సైలతో విభేదాలు, రాజకీయ ఒత్తిళ్లు, కాగ్నా ఇసుక అక్రమ రవాణాపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు, ఐజీల ఆగ్రహానికి లోనవుతున్నారు. ఇష్టపడి పైరవీలతో తెచ్చుకున్న పోస్టులలో పూర్తికాలం పని చేయకుండానే వేకెన్సీ రిజర్వులో ఉండిపోతున్నారు. 2012 ఫిబ్రవరి 2న గౌతాపూర్‌గ్రామ సమీపంలో కరణ్‌కోట్ (తాండూరు రూరల్) పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. స్టేషన్ ప్రారంభం నుంచీ ఇక్కడ పనిచేసే సీఐలు వివాదంలో చిక్కుకుంటున్నారు. ఈ స్టేషన్ ప్రారంభ సమయంలో సీఐ శ్రీనివాసులును తాండూరుకు చెందిన పౌరులు కొందరు గజమాలతో సన్మానించి హోంమంత్రి సబితారెడ్డి ఐజీ రాజీవ్ రతన్ సమక్షంలో పొగడ్తలతో ముంచెత్తారు. ఈ విషయమై సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారులు సీఐని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. 2013 జనవరి 16లో కస్టడీలో ఉన్న నిందితుడు మల్లేష్ పోలీసులు

మిగతా 8వ పేజీలో...



రాత్రంతా కౌన్సెలింగ్

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్త ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ వికారాబాద్‌లో అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉదయం స్కూల్ అసిస్టెంట్లకు పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన తరువాత కౌన్సెలింగ్ వాయిదా పడిందంటూ విద్యాశాఖ అధికారులు నుంచి మేసేజ్‌లు వచ్చాయి. దీంతో కౌన్సిలింగ్‌కు వచ్చిన ఏంఈవోలు, కొత్త ఉపాధ్యాయుల్లో చాలా మంది వరకు వెనుదిరిగారు. ఆ తరువాత కొద్ది సేపటికే డీఎస్సీ 2024 నియామకమైన కొత్త ఉపాధ్యాయులకు మంగళవారమే కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు నియామక కౌన్సెలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. డీఈవోరేణుకాదేవి నేతృత్వంలో మధ్యాహ్నం 3గంటలకు స్కూల్‌అసిస్టెంట్, పీడీపోస్టులకు కౌన్సెలింగ్ ప్రారంభించగా సాయంత్రం6.30 గంటల వరకు కొనసాగింది. రాత్రి 7 గంటలకు ఎస్జీటీ,ఎల్పీ పోస్టులకు పోస్టింగుల కౌన్సెలింగ్ ప్రారంభించగా, ఈ కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కౌన్సెలింగ్ ప్రక్రియకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి పరిశీలించారు. ఇదిలా ఉండగా, ఉపాధ్యాయ పోస్టుల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను బ్లాక్ చేసి మారుమూల గ్రామాల్లోని పాఠశాలలను చూపించారని అభ్యర్థులు ఆరోపించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించి..

వేతనాలు పెంచాలి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన వేతనాల పెంపు హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ మేడ్చల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. రూ.3వేల నుంచి రూ.10వేలు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. బిల్లులు చెల్లించకపోవటంతో విద్యార్థులకు అప్పులు చేసి అన్నం పెట్టాల్సిన దుస్థితి నెలకొందని వారు వాపోయారు.



నిరసన చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గ్యార్మీ షరీఫ్.. ముస్లింల ర్యాలీ



గ్యార్మీ షరీఫ్ నెల ప్రారంభం సందర్భంగా ముస్లింలు సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మాజీద్, జిలానీ, శివకుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఖాజపాష, ఖమర్, మైనొద్దీన్, జావీద్, షబ్బీర్, సాజీద్, ఖాజా, ఖలీల్, రఫీక్ పాల్గొన్నారు.

- దోమ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

ఓటు నమోదుకు చొరవ చూపాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో హరిప్రియతో కలిసి ఆయన వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత ఎక్కువ శాతం ఉన్నప్పటికీ ఓటరు నమోదు శాతం పెరగడం లేదని, వార్డుమెంబర్ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా చొరవతీకోవాలని పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల కమిషన్ సూచన మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా 1500 మందికి ఒక పోలింగ్ బూత్ ప్రకారం.. అదనంగా 38 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్‌లో 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ మార్పుపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసన్నకు ప్రశంసలు

ఇండో-థాయిలాండ్ త్రోబాల్ సిరీస్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని



ప్రసన్నను సన్మానిస్తున్న సీఎంఆర్ కళాశాల యాజమాన్యం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇండో-థాయ్‌లాండ్ త్రోబాల్ సిరీస్-2024 టోర్నమెంట్(వుమెన్)లో భారత్ తరపున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిన కె.ప్రసన్నను మంగళవారం సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చదువుతున్న ప్రసన్న ఇటీవల థాయ్‌లాండ్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. ఈమేరకు ఆమెకు కళాశాల వైస్‌చైర్మన్ సి.భూపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలం రెడ్డిలు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని పాల్గొని త్రోబాల్ విభాగంలో ప్రతిభ కనపరచటం అభినందనీయమని భూపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో పాటు విద్యార్థులు ప్రసన్నను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాసులురెడ్డి, సీఎస్ఈ విభాగం హెడ్ డాక్టర్ కుమారస్వామి, పీడీ రాజేష్‌గౌడ్, డీన్, కేవీ రెడ్డిలు పాల్గొన్నారు.

సరసస్వర సుర..

- తెలుగు సంగీతానికి చిన్నారుల స్వరసేవ
- యూట్యూబ్ చానల్‌తో ప్రత్యేక గుర్తింపు
- రెండేళ్లలో 1.74 లక్షల సబ్‌స్క్రైబర్లు
- ప్రజల మన్ననలు పొందుతున్న నిఖిత, రుచిత

పరిగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగీతంపై ఉన్న మక్కువతో ఓ తండ్రి తన ఇద్దరు కూతుళ్లను ప్రోత్సహించడంతో వారు పలువురి మన్ననలు పొందేలా చేస్తున్నాడు. ఆ చిన్నారులిద్దరూ సంగీతం సమకూర్చుతూ భక్తి, ఆధ్యాత్మిక పాటలతో అలరిస్తూ తమ ప్రతిభ నలుగురికీ తెలిసేలా రీల్స్‌చేసి ఓ యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నారు. పరిగి పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులు చేసిన చిరు ప్రయత్నంతో నేటికి 1.70 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్న యూట్యూబ్ ఛానల్ నడుస్తోంది. గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ప్రాగటూరు గ్రామానికి చెందిన దేశం మల్లేశం కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం పరిగి పట్టణానికి వచ్చాడు. పరిగిలో జ్యూస్ సెంటర్ నడుపుతున్నాడు. మల్లేశానికి ఇద్దరు కూతుళ్లు నిఖిత, రుచిత. పరిగిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో నిఖిత ఎనిమిది, రుచిత ఏడో తరగతి చదువుతున్నారు.


హార్మోనియంతో నిఖిత, రుచిత (ఫైల్)

కాగా, మల్లేశంకు సంగీతంపై ఆసక్తి ఎక్కువ. హార్మోనియం వాయించడం అలవాటు. దాంతో కూతుళ్లకు కూడా నేర్పించాడు.



శివరాత్రి ఉత్సవాల్లో.. (ఫైల్)

తండ్రి ప్రోత్సాహంతో..

నిఖిత, రుచితలు తమ ప్రతిభను అందరికీ చూపించాలని రెండేళ్ల క్రితం తెలుగు సంగీత స్వరం పేరుతో యూట్యూబ్ ఛానల్‌ని ప్రారంభించారు. రెండేళ్లలోపే సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1.74 లక్షలకు చేరింది. కాగా, వారు ఇప్పటి వరకు 697 రీల్స్‌ను తమ చానల్‌లో అప్‌లోడ్ చేశారు. శివుడిపై చేసిన ఓ పాటను 26 లక్షలు, రావోయి చందమామకు 41 లక్షల మంది వ్యూవర్స్ చూశారు. తెలుగు సంగీత స్వరం చానల్‌తో పాటు ఆ చిన్నారులు తండ్రి మల్లేశంతో కలిసి వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నిర్వహించే సంగీత, సాహిత్య కార్యక్రమాలకూ వెళ్తుంటారు. అయితే, నాన్న మల్లేశం ప్రోత్సాహంతోనే సంగీతంపై రీల్స్‌చేసి ఛానల్‌ను నడుతున్నామని చిన్నారులు చెబుతున్నారు. తమ ఛానల్ ద్వారా అంతరించిపోతున్న సంగీతం, నాట్యకళలు బతికే ఉన్నాయని చెప్పడానికి చిరు ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నారు. తమకు కావాల్సిన ప్రోత్సాహం లభిస్తే ఇంకా ముందుకు వెళతామని వారు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

వికారాబాద్ వాసికి పీహెచ్‌డీ పట్టా


పీహెచ్‌డీ డిగ్రీ అందుకుంటున్న డాక్టర్ చందన

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో రాజకీయ శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వికారాబాద్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఏ.చందన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టాను పొందారు. 'రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉపాధి సృష్టి, గ్రామీణ అభివృద్ధి వైపు ఒక మైలు రాయి' అనే విషయంలో రంగారెడ్డి జిల్లాలోని అంశాలపై కేస్ స్టడీ రూపంలో చేసిన పరిశోధన విజయవంతంగా పూర్తి చేసినందుకు గానూ ఆమె పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

ఎంపీ బలరామ్ నాయక్‌ను కలిసిన కేశవులు


బలరామ్ నాయక్‌తో గుర్రం కేశవులు

ఆమనగల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్‌ను మంగళవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నందున వాటి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకారం అందేలా చూడాలని ఎంపీని కోరినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు కేశవులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు బికుమాండ్ల రమేశ్ తదితరులు ఉన్నారు.

చౌదర్‌పల్లివాసికి మెడికల్ సీటు


అవినాశ్

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చౌదర్‌పల్లి గ్రామానికిచెందిన కావటి వెంకటయ్య స్వప్నల కుమారుడు అవినాశ్ నల్గొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ ఏడాది నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1,24,493 ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 1801 ర్యాంక్ సాధించాడు. దాంతో మెడికల్ కళాశాలలో సీటు లభించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన కావటి వెంకటయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ అవినాశ్‌ను చదివించాడు.

సర్దార్‌నగర్‌లో స్ట్రీట్‌లైట్లను ప్రారంభించాలి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మహేశ్వరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపల్ కేంద్రం నుంచి సర్దార్‌నగర్ వరకు స్ట్రీట్‌లైట్లను ప్రారంభించాలని సర్దార్‌నగర్ గ్రామస్తులు మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలతా రాజుగౌడ్‌ను ఆమె చాంబర్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసి సంవత్సరం కావస్తున్నా.. ఎందుకు ప్రారంభించలేదో అధికారులను అడిగి తెలుసుకుంటానన్నారు. రచ్చ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కలిసి పనిచేస్తాం

(5వ పేజీ తరువాయి)

ప్రజలకు గర్వకారణమన్నారు. దేశంలోనే రెండో రాడార్ స్టేషన్ దామగుండంలో ఏర్పాటు కావడం చరిత్రాత్మకమన్నారు.

అడ్డుకునే ప్రయత్నం వద్దు

నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో వికారాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు రానుందన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ఇక్కడ దామగుండం శివుడే వారికి తెలివిని ప్రసాదిస్తాడని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదన్నారు. లక్షల చెట్లు తీసేదేమీ లేదని, అబద్ధాలు చెప్పే వారి మాటలు నమ్మొద్దన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో తాను నిలబడి పని చేయిస్తామన్నారు. దామగుండంలో ప్రజలు విశ్వసించే పవిత్ర దేవాలయం ఉందని అక్కడికి ప్రజలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసి వచ్చి పోయేందుకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇక్కడ పిల్లలు చదువుకునేందుకు ప్రత్యేక విద్యాసంస్థల ద్వారా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంపూర్ణ మద్దతు

రాజకీయాల్లో సైద్ధాంతిక వైరుధ్యాలు ఉండొచ్చు.. కానీ దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో కొందరు



రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నేవీ అధికారులు, పక్కన సీఎం రేవంత్, ఎంపీ సంజయ్

అపోహలు సృష్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అడిగిన వెంటనే తాము కార్యాచరణను ముందుకు తీసుకెళ్లామన్నారు. ప్రాజెక్టు పూర్తయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కేంద్ర మంత్రి బండి సంజయ్, భారత నావికాదళం ప్రధానాధికారి దినేశ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, నేవీ అధికారులు రాజేశ్ బండారు, మల్లికార్జునరావు, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు ఉమాహారతి, లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు మంజుల, స్వప్నపరిమల్, నాయకులు రమేశ్, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, కిషన్ నాయక్, లాల్ కృష్ణప్రసాద్, రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: రామ్మోహన్‌రెడ్డి



నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుపై గిట్టనివారు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దామగుండం అడవులు దేశంలోనే పవిత్రమైనవన్నారు. మన ప్రాంతంలో ఈ ప్రత్యేకమైన దేశ రక్షణకు సంబంధించిన సెంటర్‌ను ఏర్పాటు చేయడం జిల్లా ప్రజలు గర్వించాల్సిన విషయమన్నారు. 2014లోనే తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పూడూరులో ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందన్నారు. అందరి ఆమోదంతోనే ముందుకు కొనసాగిందన్నారు. సెల్‌ఫోన్ రేడియేషన్ కంటే నేవీ రాడార్ స్టేషన్‌లో చాలా తక్కువ రేడియేషన్ ఉంటుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ సెంటర్ పరిధిలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూల్, ఆస్పత్రులు ఏర్పాటు అవుతాయన్నారు. అందులో స్థానికులకు 15 శాతం అధిక అవకాశాలు ఉంటాయన్నారు.


శామీర్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలు

శామీర్‌పేట/ఘట్‌కేసర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలను వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్లో మంగళవారం తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండలాధ్యక్షుడు వైఎస్ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకై శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల, తూంకుంట మున్సిపల్, జవహర్‌నగర్ కార్పొరేషన్ పార్టీ ముఖ్యనాయకులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ ముఖ్యనాయకులకు ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, ముజీబ్, బాలేష్, తదితరులున్నారు. అలాగే పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో జరిగిన ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ఇందిరమ్మ కమిటీల సన్నాహక సమావేశంలో తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఒకట్రెండు రోజుల్లో ఇందిరమ్మ కమిటీల నియామకాన్ని పూర్తిచేయాలని, కమిటీల్లో ఐదుగురు పార్టీ నాయకులు, ఒకరు స్థానిక ప్రజాప్రతినిధి ఉండేలా చూడాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేయర్లు అజయ్ యాదవ్, అమర్‌సింగ్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా మైబుసుభానీ దర్గా ఉర్సు


దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం లోని చంద్రవంచలో మహబూబ్ సుభాని దర్గా ఉర్సును మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మసీదు నుంచి గంధం, జెండాలతో బ్యాండు మేళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గా వద్దకు చేరుకుని పూలు, గంధం పువ్వులు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకతీతంగా గ్రామస్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు సుదర్శన్‌రెడ్డి, రవిశంకర్ పటేల్ పాల్గొన్నారు.

విద్యుత్ ఏడీఈగా బాలకృష్ణ

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఆమనగల్లు ఏడీఈగా బాలకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ నుంచి ఆయన బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ తుర్కయంజాల్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు డీఈ కార్యాలయంలో బాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించి, మెరుగైన కరెంటు సరఫరా వంతు కృషి చేస్తానని బాలకృష్ణ తెలిపారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్ సిగ్మాయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో దుర్గమాత నిమజ్జనం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి శోభాయాత్రలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు. మండప నిర్వాహకులు బింగి రాజేందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్‌లు పలువురు నాయకులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, విశ్వనాథం, ప్రవీణ్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.


నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు


శామీర్‌పేటలోని అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

శామీర్‌పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 14న వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం కల్యాణం సందర్భంగా త్రిశక్తి పీఠం శ్రీశక్త్యానందగిరి స్వామి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, మాజీ జడ్పీటీసీ అనితా లాలయ్యలు పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు గౌడ సంఘం నాయకులు వారిని ఆలయ మర్యాదలతో సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి


యువకులతో మాట్లాడుతున్న సీఐ శంకర్‌కుమార్

యాచారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సీఐ శంకర్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి యాచారం మండల కేంద్రంలోని సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో బాగంగా చిరువ్యాపారులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. అక్కడున్న యువకులతో మాట్లాడారు. మండల కేంద్రంలో నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపిస్తే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, రాత్రివేళ ఎవరైనా ఇంటికొచ్చి పిలిచినా.. తీయాలని కోరినా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని యువకులను కోరారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సైలు మధు, సత్యనారాయణ తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి


టీకాలు వేస్తున్న పశు వైద్య అధికారులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని డీవీహెచ్‌వో సదానందం అన్నారు. కొడంగల్ పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్‌ప్రశాంత్ ప్రారంభించారు. వచ్చే నెల 14వ తేదీవరకు రెండవ విడత గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పశువైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నోహా, పశువైద్యులు పరమేష్, జేవీవో వెంకటయ్య, వీఏ శేఖర్, సిబ్బంది ప్రసాద్, పకిరప్ప, గోపాల మిత్ర శివకుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లక్కాకుల శివకుమార్ (31) కోట్‌పల్లిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడగా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చాలని ఒత్తిడి రావడంతో వికారాబాద్ మండలం మైలార్ దేవరంపల్లి గ్రామ సమీపంలో తన కారులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వికారాబాద్ తరలించారు. మృతుడి తండ్రి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సుల్తాన్‌పూర్‌లో భారీ చోరీ

- 12తులాల బంగారం, 46తులాల వెండి, రూ.50వేల నగదు అపహరణ

పరిగి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిగి పోలీసుస్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో దొంగలు రెచ్చిపోయారు. తాళంవేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుల్తాన్‌పూర్‌లో సోమవారం రాత్రి దొంగలు పడి ఐదిళ్లలో చోరీ చేశారు. 12తులాల మేర బంగారు ఆభరణాలు, 46 తులాల వెండి ఆభరణాలు, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. గ్రామానికి చెందిన గున్నమొళ్ల శ్రీనివాస్ ఇంటి తాళం విరగ్గొట్టి 5తులాల బంగారం, 23 తులాల వెండి వస్తువులు, కొల్లూరి భారతమ్మ ఇంట్లో బీరువా తాళం పగలగొట్టి 6తులాల బంగారం, 3తులాల వెండి ఆభరణాలు, కొత్తూరి శ్రీనివాస్ ఇంట్లో 9 గ్రాముల బంగారం, 20తులాల వెండి వస్తువులు, బుడ్డయ్యల నర్సింహులు ఇంట్లో రూ.50వేల నగదు, 9గ్రాముల బంగారం చోరీకి పాల్పడ్డారు. కాగా బుడ్డయ్యల వెంకటయ్య ఇంట్లో చోరీ చేయగా విలువైన వస్తువులు లభించకపోవడంతో వెనుదిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన విషయాన్ని మంగళవారం బాధితులు పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్‌కుమార్ ఘటనాస్థలాన్ని చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఇందిరమ్మకు అడుగులు

- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కమిటీలు
- తాండూరు నియోజకవర్గంలో 182 కమిటీలు
- నియోజకవర్గానికి స్థానిక ఎమ్మెల్యేనే చైర్మన్!
- తాండూరు సెగ్మెంట్‌కు 3,500 ఇందిరమ్మ ఇళ్లు

తాండూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యానికి అడుగులు పడ్డాయి. గ్రామ, వార్డు స్థాయి (క్షేత్ర)లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల అమలుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కూడా ఇందిరమ్మ కమిటీల ద్వారానే ఇళ్లు, సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయం విధితమే. కాగా, రాష్ట్ర సరిహద్దులో ఉన్న తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 182 ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ కమిటీలను గ్రామాల్లో వార్డుల వారీగా నియమించారు. ఈ కమిటీల ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ గ్రామ, వార్డుస్థాయి నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు

కమిటీల వివరాలు

మున్సిపాలిటీ/ మండలం	కమిటీల సంఖ్య	కమిటీసభ్యుల సంఖ్య
తాండూరు మున్సిపాలిటీ	36	252
పెద్దేముల్ మండలం	37	259
తాండూరు మండలం	33	231
యాలాల మండలం	37	289
బషీరాబాద్ మండలం	39	273

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

కమిటీల ఏర్పాటు పూర్తయ్యాక ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. కాగా, వీటిని స్థానిక ఎమ్మెల్యే మున్సిపాలిటీ, మండలాల వారీగా కేటాయిస్తారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇళ్లు కేటాయించేందుకు అర్హులను ఎంపిక చేస్తారు.



నియోజకవర్గానికి చైర్మన్‌గా ఎమ్మెల్యే!

ఇందిరమ్మ కమిటీలకు సంబంధించి నియోజకవర్గానికి స్థానిక ఎమ్మెల్యేను చైర్మన్‌గా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్రామాలలో గ్రామ, మున్సిపాలిటీలలో వార్డు కమిటీల ప్రక్రియ చేపట్టిన విషయం విధితమే. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలను చైర్మన్‌గా, ఆర్డీవోలు, సబ్ కలెక్టర్, డీఎల్పీవోలను కన్వీనర్లుగా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

మండలాలకు 500 చొప్పున, మున్సిపాలిటీకి 600కు పైగా కేటాయించే అవకాశాలున్నాయి. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఇళ్లు కేటాయించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తారు. ఇందులో మూడు రకాలుగా వర్గీకరణచేసే అవకాశాలున్నాయి. స్థలం ఉన్నవారికి ఒక కేటగిరి కింద, ఇల్లు ఇవ్వడానికి అర్హులై ఉన్నప్పటికీ స్థలం లేని వారిని మరో కేటగిరీ కింద, డబుల్ బెడ్ రూమ్‌లు రానివారి ఇంకో కేటగిరీ కింద విభజించే అవకాశం ఉంది. ఏదిఏమైనా పేదల సొంతింటి కల నెరవేరేందుకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

న్యూస్ బాక్స్

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

నవాబుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేకాధికారి చైర్మన్‌గా ఉంటారని, స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ ముగ్గురిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు తప్పక సభ్యులుగా ఉండాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీలోని సుర్విబాబయ్య ఫంక్షన్‌హాల్‌లో ఇందిరమ్మఇళ్ల పథకం అమలుపై నేడు(బుధవారం)సాయంత్రం 4గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కీసర మండల స్థాయిలో నిర్వహించనున్న ఈ సమావేశానికి నియోజక వర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని.. నిర్బంధ పాలన అని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ విమర్శించారు. నేవీ రాడర్ ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మోమిన్ పేట మండలంలో ఓవ్యక్తి చనిపోయారని వెళ్లేందుకు చూడగా మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని, లేదంటే ప్రజలు ఈ ప్రభుత్వానికి త్వరలోనే తగిన గుణపాఠం చెప్పి తీరుతారన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతీకార పాలన కొనసాగిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ప్రశాంత తెలంగాణను నిర్బంద తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. వికారాబాద్ దామగుండం అడవిలోనేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటునునిరసిస్తూ ఆయన నల్లబ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్‌జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుఉతున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడే నిర్బంధించడంపై మండిపడ్డారు. అదేవిధంగా జిల్లాలో ప్రజా సంఘాల నాయకులను అర్ధరాత్రి నుంచి అరెస్టులు చేయడం అప్రజాస్వామికమైన చర్య అని దామగుండం అడవి పరిరక్షణ వేదిక నాయకులు తీవ్రంగా అన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి రాడార్ స్టేషన్‌ను ఏడారి ప్రాంతాలకు తరలించి అడవిని కాపాడాలని అన్నారు.



వికారాబాద్: నల్లబ్యాడ్జీతో శుభప్రద్ పటేల్ నిరసన

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

దోమ: పూడూరు మండలం దామగుండంలో మంగళవారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన సందర్భంగా పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. దోమ వైస్ఎంపీపీ మల్లేశ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్‌ను సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

యాలాల: దామగుండం నేవీ రాడర్ స్టేషన్ శంకుస్థాపనను అడ్డుకోకుండా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్యను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

కులకచర్ల: పూడూరు మండలం దామగుండం దగ్గర నేవీ రాడార్ ప్రారంభోత్సవాన్ని అడ్డుకోకుండా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, పార్టీ నాయకులు పీరంపల్లి రాజు, సారా శ్రీనివాస్, బిచ్చయ్యలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

పరిగి రూరల్: దామగుండం నేవీ రాడర్ ప్రాజెక్టు శంకుస్థాపన సందర్భంగా మంగళవారం పరిగిలో పోలీసులు పలువురిని ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ చైర్మన్ దేవనోనిగూడెం వెంకటయ్య, సునంద బుగ్గన్న, రామన్న మాదిగ, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం, ముకుంద నాగేశ్వర్, రవికుమార్, శ్రీనివాస్, రాములు, ప్రవీణ్, ఆనంద్, బుచ్చన్న ఉన్నారు.

పూడూరు: దామగుండం నేవీరాడర్ కేంద్రం శంకుస్థాపనకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన నేపథ్యంలో మంగళవారం మన్నెగూడ వద్ద ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపివేశారు. పోలీసులు ముందుగానే వాహనాలు దారిమళ్లించి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూశారు. మరోవైపు ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు యత్నించిన దామగుండం జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరిని కుల్కచర్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు.



పరిగి రూరల్: నల్ల బ్యాడ్జీలు ధరించి నాయకుల నిరసన



దోమ: అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ

- పరిగి నియోజకవర్గానికి రూ.22కోట్లు మంజూరు

పరిగి రూరల్, అక్టోబరు 15: పరిగి నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ పట్టిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధిలో 22.20 కిలోమీటర్ల రోడ్డుకు మొత్తం రూ.22కోట్ల నిధులు మంజూరయ్యాని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలోని నాంచర్ల-చౌదర్‌పల్లి రోడ్డుకు రూ.2కోట్లు, రెడ్డిపల్లి-చెన్నైపల్లితండా రోడ్డుకు రూ.3కోట్ల 60లక్షలు, గూడూరు-శివారెడ్డిపల్లి రోడ్డుకు రూ.కోటి 20లక్షలు, పీడబ్ల్యూడీ-లక్ష్మీపూర్ రోడ్డుకు రూ.6కోట్ల 30లక్షలు, సుల్తాన్‌పూర్-సుల్తాన్‌పూర్‌తండా రోడ్డుకు రూ.2కోట్లు, పీడబ్ల్యూడీ-దొంన్నెపల్లి వయా దోర్నాల్ వరకు రోడ్డుకు రూ.కోటీ 28లక్షలు, చక్కపల్లి-ఫతేపూర్ లిమిట్స్ రోడ్డుకు రూ.కోటీ 65లక్షలు, నెన్కెపల్లి-మిర్జాపూర్ వయా చెంచుపల్లి రోడ్డుకు రూ.కోటి, జడ్పీ రోడ్డు నుంచి అడివివెంకటాపూర్ వయా బలరాంతండా రోడ్డుకు రూ.97లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.

చేవెళ్ల ప్రాంత అభివృద్ధిలో నేవీ రాడార్ స్టేషన్ మైలురాయి



నేవీ రాడార్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ప్రాంత అభివృద్ధిలో నేవీ రాడార్ స్టేషన్ మైలురాయిగా నిలుస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేవీరాడార్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కేంద్ర రక్షణ శాఖ అధికారులకు, జిల్లా అధికార యంత్రాంగానికి ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నేవీ రాడార్ స్టేషన్‌తో దామగుండం పరిసరాలు అభివృద్ధిలో దూసుకెళ్తాయన్నారు. ఈప్రాజెక్ట్ మనప్రాంతంలో నెలకొల్పడం ఎంతో ప్రతిష్టాత్మకమని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కలిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు.

అయోమయం!

(ఐదో పేజీ తరువాయి)

ఉండే ముగ్గురిని సభ్యులుగా నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ముగ్గురు బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున నియమించనున్నారు.

జిల్లాకు 17,500 ఇళ్లు

ఇందిరమ్మ పథకంలో భాగంగా పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. మొదటి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఒక్కొక్క నియోజకవర్గంలో 3,500 చొప్పున జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు 17,500 ఇళ్లను మంజూరు చేయనున్నట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు అధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

కమిటీలదే ముఖ్య పాత్ర..

కమిటీలు ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి ఎప్పటికప్పుడు గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపట్టనున్నాయి. లబ్ధిదారులకు సహాయంగా ఉండటంతో పాటు సామాజిక తనిఖీ సైతం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు. అర్హులకు ఇళ్లు అందకపోవడం, అలాగే అనర్హులకు దక్కడం లాంటివి ఏమైనా చోటుచేసుకుంటే సత్వరమే కమిటీలు స్పందిస్తాయి.

భారీ దరఖాస్తులు

మరోవైపు గతేడాది డిసెంబరులో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో వివిధ పథకాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించింది. ఇళ్ల నిర్మాణం కోసం వచ్చిన దరఖాస్తు వివరాలను నూతనంగా ఏర్పాటు అవుతున్న ఇందిరమ్మ కమిటీలకు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. కమిటీ చైర్మన్, కన్వీనర్‌తో పాటు అందులోని సభ్యులు స్వతంత్రంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టేందుకు ఎంతమేరకు అవకాశం ఇస్తారన్న సందేహం ప్రజల్లో వ్యక్తమౌతోంది. తమ ప్రమేయం లేకుండా ఎంపిక ప్రక్రియ ఎలా సాధ్యమౌతుందని పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

ప్రక్రియ కొనసాగుతున్నది

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ కమిటీల ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీల నియామకం ఉంటుంది. జిల్లాలోని 13మున్సిపాల్టీలు, 34 గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల నియామకాన్ని చేపడుతున్నాము. 2, 3 రోజుల్లో కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వానికి పంపిస్తాము. - రాధికా గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్.

వివాదాల ఠాణా!

(ఐదో పేజీ తరువాయి)

చిత్రహింసలు పెడుతున్నారని స్టేషన్ భవనంపై దూకి ఆత్మహత్య చేసుకోవడంతో అప్పట్లో సీఐగా పని చేస్తున్న శ్రీనివాస్ ఎస్సై పవన్ కుమార్, ఉన్నతాధికారుల విచారణ అనంతరం ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇదే స్టేషన్‌లో కొంత మంది కానిస్టేబుళ్లు రాజకీయ నాయకుల నుంచి బిర్యానీలు తెప్పించుకొని విందు చేసుకున్నారనే ఆరోపణలతో ఐదుగురు పోలీసులను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. 2014 సీఐగా వచ్చిన రవికుమార్ ఇంకా 8 నెలలకాలం కొనసాగాల్సి ఉండగా.. మహబూబ్ నగర్ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఇసుక తరలింపు అవినీతి ఆరోపణలు, రాజకీయ ఒత్తిళ్లతో బదిలీ వేటు పడింది. అప్పట్లో సంగారెడ్డి టౌన్ సీఐగా పనిచేసిన శివశంకర్ 2014 సెప్టెంబరు 24న బదిలీపై కరణ్‌కోట్ వచ్చారు. 2015 సెప్టెంబరు 16న యాలాల ఎస్సై రమేష్ కందనెల్లి శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఆత్మహత్యకు సీఐ కారణమంటూ కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన్ను వెంటనే అటాచ్ చేశారు. ఆ తర్వాత సీఐ సైదిరెడ్డి యాలాల ఎస్సై అరుణ్ కుమార్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. 2017లో యాలాల మండలం సంగెంకుర్దులో ఓ వివాహిత అదృశ్యం.. హత్య కేసు విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. దాంతో సీఐ సైదిరెడ్డి, ఎస్సై అరుణ్‌కుమార్‌ను అటాచ్ చేశారు. తర్వాత పలు ఆరోపణల నేపథ్యంలో సైదిరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. తర్వాత ధారూర్ సీఐగా పనిచేస్తున్న ఉపేందర్ 2018 ఆగస్టు 4న తాండూరురూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. 2019 జూలైలో పలు ఆరోపణల నేపథ్యంలో రాజకీయ ఒత్తిళ్లతో ఏడాది లోపే ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధితో పాటు వికారాబాద్ ఎస్పీలో పనిచేస్తున్న సురేందర్‌రెడ్డి, సీఐ ఉపేందర్‌పై ఫిర్యాదుతో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. తర్వాత జలందర్‌రెడ్డి, రాంబాబు సీఐలుగా వచ్చినప్పటికీ సీఐ రాంబాబు బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలతో పూర్తికాలం పని చేయలేకపోయారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై బదిలీ వేటు వేసింది. 2024 జనవరిలో రూరల్ సీఐగా జడ్చర్ల నుంచి బదిలీపై వచ్చిన అశోక్‌కుమార్ అనతి కాలంలోనే ఇసుక ఆరోపణలపై ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇంకా సీఐ రిలీవ్ కావాల్సి ఉంది. కాగా, వివాదస్పదంలో సీఐలు చిక్కుకుంటున్నారని తెలిసినా ఈ స్టేషన్‌లో పోస్టింగ్ కోసం 10మంది వరకు సీఐలు ప్రయత్నాలు చేస్తున్నారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత్‌కు ఏపీజే అబ్దుల్ కలాం అందించిన సేవలు మరువలేనివని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ రమేష్, ఇన్‌చార్జి కమిషనర్ రాకేష్ రెడ్డి, మునిసిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



వికారాబాద్: అబ్దుల్ కలామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్, అధికారులు



ఘట్‌కేసర్ రూరల్: అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అవుషాపూర్‌లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మశ్చేందర్‌రెడ్డి, సాయిలు, వెంకట్‌రెడ్డి, జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు ఇళ్ల వద్దకు వచ్చి చెత్త సేకరించే మున్సిపల్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో మంగళవారం తడి, పొడి చెత్తను నిల్వచేసే బకెట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్, మాజీసర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణస్వీకారం

బొంరాస్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రేపు(గురువారం) వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ గ్రంథాలయ ఆవరణలో ఉదయం 11గంటలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ల ప్రమాణస్వీకారం ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన రాజేశ్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మోమిన్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీమలదరిలో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, మెతుకు ఆనంద్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన మాధవరెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి దసరా పండగకు స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం గుండెపోటుతో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న వారు మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు నరోత్తంరెడ్డి, మాధవరెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

'అనురాగ్'లో ప్రీ-రిపబ్లిక్ డే ఎంపిక పోటీలు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం యూనివర్సిటీ లెవల్ ప్రీ-రిపబ్లిక్ డే ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 50 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఎంపికైన వలంటీర్లు నేటి నుంచి నవంబరు 21వ తేదీ వరకు మహారాష్ట్ర, జల్గాన్‌లోని మహారాష్ట్ర యూనివర్సిటీలో నిర్వహించే ప్రీ-రిపబ్లిక్ పరేడ్ క్యాంప్‌లో పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ తెలిపారు. ఎంపికైన వలంటీర్లను అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.రామకృష్ణ, రీజినల్ డైరెక్టర్ సంజయ్, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

కీసర రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని కీసర ట్రాఫిక్ ఎస్ఐ నర్సింహ అన్నారు. కీసర మండల కేంద్రంలో మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మోమిన్‌పేట్: సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ పుండరీకం తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం పోలీసు సిబ్బందితో కలిసి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సాయికుమార్, మల్లేశం పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన అభ్యర్థులకు సన్మానం



బొంపల్లిలో ఎంబీబీఎస్ సీటు సాధించిన అభ్యర్థులకు సన్మానం

దోమ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లికి చెందిన కోళ్ల భీమయ్య కూతుర్లు భార్గవి, అనూషలు ఇద్దరూ ఇటీవల విడుదలైన ఎంబీబీఎస్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. భీమయ్య కోళ్ల హనుమయ్య ఆధ్వర్యంలో మంగళవారం శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వినయ్, అరుణ్, గణేశ్‌తో పాటు గ్రామస్తులు శ్రీనివాస్, వెంకటేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంట్వారం (కోట్‌పల్లి), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కుపల్లి గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ సందర్భంగా వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 22సంవత్సరాల తర్వాత పూర్వవిద్యార్థులంతా ఒకేచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తోటి మిత్రులకు ఆపదలో ఆదుకోవడంతో పాటు పాఠశాల విద్య అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ అశోక్, ఎండీ ముస్తాక్, ఎం.నర్సింహులు, కె.నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని పలు ఆలయాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు దేవాదాయ శాఖ ఈవో నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ శాఖ కమిషనర్ ఆదేశాలతో తాండూరులోని సద్గురు పోట్లి మహరాజ్ ఆలయం, నగరేశ్వర ఆలయం, శ్రీబాలాజీ మందిర్‌తోపాటు యాలాల మండలంలోని రసూల్‌పూర్ హనుమాన్ ఆలయాలకు నోటిఫికేషన్ వచ్చిందని తెలిపారు. 20రోజుల్లో రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందని సూచించారు.

విద్యుత్ శాఖ అధికారుల బదిలీ

తాండూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):: తాండూరు విద్యుత్ శాఖలో మూడు సంవత్సరాలుగా పనిచేసిన ఏడీ భాను ప్రసాద్ చందానగర్‌కు బదిలీపై వెళ్లారు. అదేవిధంగా తాండూరు మండల విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తున్న వెంకట్‌నాయుడు ఉద్యోగోన్నతిపై ఏడీగా పరిగికి బదిలీ అయ్యారు. వీరిని మంగళవారం తాండూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో వీడ్కోలు పలుకుతూ డీఈ భాను ప్రసాద్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాండూరు పట్టణ ఏఈ రఘువీరారెడ్డి, లైన్‌మెన్ వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.